సాక్షి
నంద్యాల
బుధవారం ၊ 23 ၊ ఏప్రిల్ ၊ 2025



కూలిన బతుకులు

ఇంటి నిర్మాణానికి పిల్లర్లు వేస్తుండగా పైనుంచి మట్టి పెళ్లలు మీద పడి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఈ దుర్ఘటన గూడూరులో చోటు చేసుకుంది. 8లో▸



కానుకల లెక్కింపు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో ఏప్రిల్ నెలకు సంబంధించి హుండీల్లో కా నుకల లెక్కింపు ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు.

అరుదైన అరటి గెల



పాణ్యం: అరటి గెలకు 160 నుంచి 180 వరకు కాయలు ఉంటాయి. కెఆర్‌ఆర్ తండాకు చెందిన రైతు చంద్రానాయక్ పొలంలో గెలకు 280 కాయలు వచ్చాయి.

న్యూస్‌రీల్

వడదెబ్బతో మహిళ మృతి



మృతి చెందిన సారమ్మ

కోవెలకుంట్ల: పట్టణంలోని నాగులకట్ట సమీపంలో మంగళవారం సాయంత్రం వడదెబ్బతో ఓ మహిళ మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని భీమునిపాడుకు చెందిన సారమ్మ ఉదయం మిరపకోత పనికి వెళ్లింది. ఎండ తీవ్రత కారణంగా ఇంటికి చేరుకుని అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చింది. ఆసుపత్రికి దగ్గరకు వెళ్లేలోపే అపస్మారక స్థితికి చేరుకుని కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి ముఖంపై నీళ్లుచల్లగా ఎలాంటి చలనం లేకపోవడంతో పక్కనే ఉన్న ప్రైవేట్ డాక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన మహిళను పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అక్కడున్న వ్యక్తులు మృతురాలి సంచిలో ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు.

43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటిపోయాయి. వడగాల్పుల తీవ్రత పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దొర్నిపాడు 43.9, మిడుతూరు 43.3 డిగ్రీలు, నందికొట్కూరు 43.3 డిగ్రీలు, పాణ్యం 43.7 డిగ్రీల ప్రకారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 43.5, కొతాళంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గోస్పాడు, పాములపాడు, బండి ఆత్మకూరు, సంజామల, శిరువెళ్ల, నంద్యాలల్లో కూడా 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని జిల్లా విపత్తుల నిర్వహణ అధికారి డీపీఎం అనుపమ తెలిపారు.

సీహెచ్‌ఓల నిరసన దీక్ష



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గోస్పాడు: సీహెచ్‌ఓల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్‌సీఏ జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద సీహెచ్‌ఓ, ఎంఎల్‌హెచ్‌పీలు పని చేస్తున్నారని తెలిపారు. ఆరు సంవత్సరాలు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా వేతనంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు.

బిల్లులు బాబూ!



కర్నూలు మండలం ఆర్.కొంతలపాడులో వేసిన సీసీ రోడ్డు

సంక్రాంతి, శివరాత్రి, ఉగాది కూడా పాయే

- ఉమ్మడి జిల్లాలో రూ.150.04 కోట్లతో 1,916 పనుల ప్రారంభం
- కర్నూలు జిల్లాలో వంద శాతం, నంద్యాల జిల్లాలో 98.84 శాతం పనుల పూర్తి
- ఇప్పటి వరకు విడుదలైన మొత్తం రూ.23.75 కోట్లు
- నాలుగు నెలలుగా పెండింగ్‌లో రూ.126.29 కోట్లు
- నైరాశ్యంలో చోటా కూటమి నేతలు

కర్నూలు(అర్బన్): పల్లెల్లో అంతర్గత రోడ్లపై ఆర్భాటం చేశారు. గ్రామానికి ఒక రోడ్డును మంజూరు చేసి పూర్తి స్థాయిలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ప్రచారాలను హోరెత్తించారు. పల్లె పండుగ వారోత్సవాలంటూ గత ఏడాది అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమి పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సింహ భాగం సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ వర్గీయులే ఉన్నా, వారి మాటను ఖాతరు చేయకుండా చోటా కూటమి నేతలు తమ ఇష్టారాజ్యంగా రోడ్లను మంజూరు చేయించుకున్నారు. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను విడుదల చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దాదాపు అన్ని పనులను సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేశారు. అయితే సంక్రాంతి, శివరాత్రి, ఉగాది పండుగ పోయినా, నేటికీ బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు చేసిన చోటా కూటమి నేతలు తీవ్ర నైరాశ్యంలో ఉండిపోయారు. గ్రామాల్లో అప్పులు చేసి పనులు పూర్తి చేసిన వారు నేడు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు.

నిన్న మొన్నటి వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించలేదని అపద్ధపు ఆరోపణలు చేసిన కూటమి నేతలు ప్రస్తుతం తమ ప్రభుత్వంలో బిల్లుల విడుదలలో నెలకొన్న జాప్యంపై నోరు మెదపని స్థితిలో ఉన్నారు. చేసిన పనులకు చేసినట్లుగా ఎం.బుక్ రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు పడిపోతాయని చెప్పిన దానికి, ప్రస్తుత పరిస్థితికి పొంతన లేకపోవడం గమనార్హం.

రూ.150.04 కోట్లతో 1,916 పనులు

వారోత్సవాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.150.04 కోట్లతో మొత్తం 1,916 పనుల్లో భాగంగా 270.25 కిలోమీటర్ల మేర గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి వరకు 268.51 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పనులను సంక్రాతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడా విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావుడిగా పనులను పూర్తి చేశారు.

అదే దారిలో బీటీ రోడ్ల పనులు

సీసీ రోడ్ల దారిలోనే బీటీ రోడ్లకు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 4, నంద్యాల జిల్లాలో 3 పనులు మంజూరయ్యాయి. ఉమ్మడి జిల్లాలో రూ.13.30 కోట్లతో 14.89 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లను వేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 3.60 కిలోమీటర్లు మాత్రమే వేశారు. ఈ పనులకు కూడా ఇప్పటి వరకు నయాపైసా విడుదల కాని పరిస్థితి.

రూ.126.29 కోట్ల వరకు బకాయిలు

ఆయా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.126.29 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది డిసెంబర్ నెలలో కర్నూలు జిల్లాకు రూ.14.80 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.8.95 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. సీసీ రోడ్లతో పాటు భవనాలు, ప్లాంటేషన్, మినీ గోకులాలు, బీటీ రోడ్లు, ఇతరత్రా పనులకు సంబంధించిన బిల్లులు కూడా కోట్ల రూపాయాల్లో పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

నాణ్యత కూడా అంతంత మాత్రమే..



గూడూరు మండలం పొన్నకల్‌లో వేసిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు వేగంగా చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులు విడుదల కాకపోవడం వల్ల పలు ప్రాంతాల్లో చేసిన పనులకు సంబంధించిన క్వాలిటీపై కూడా దృష్టి సారించనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం, క్యూరింగ్ కూడా సరిగా చేయనట్లు తెలుస్తోంది. రోడ్ల నాణ్యత పట్ల పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు కూడా అధిక రోడ్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో ఆయా పనుల పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించనట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,916 పనుల్లో ఇప్పటి వరకు 50 శాతం పనులను కూడా క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్లు చెక్ చేయకపోవడం గమనార్హం. నాణ్యత పరిశీలించిన పనుల్లో కూడా దాదాపు 50 నుంచి 60 శాతం పనుల్లో రికవరీకి ఆదేశించినట్లు సమాచారం. కాగా పూర్తయిన పనులకు వంద శాతం బిల్లుల చెల్లింపు జరగదని, మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకొని, క్వాలిటీ చెక్ చేసిన అనంతరం డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేస్తారని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

నెలాఖరుకు బిల్లులు విడుదలయ్యే అవకాశం



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు ఈ నెలాఖరులోగా బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది. ఉపాధి పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్, వేతనాలకు బిల్లులను విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన సీసీ రోడ్ల పనుల బిల్లులు కూడా విడుదల కానున్నాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో రూ.23.75 కోట్లు విడుదల కాగా, ఇంకా రూ.126.29 కోట్లు విడుదల కావాల్సి ఉంది. చేసిన పనులకు చేసినట్లుగా బిల్లులను అప్‌లోడ్ చేశాం.

– వి.రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్‌ఈ

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

నంద్యాల: జిల్లాలో నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆళ్లగడ్డ పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలో నేర నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించారు. పెండింగ్ కేసులు వాటి స్థితిగతులను క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్‌లో అప్‌లోడ్ చేసిన వాటి ఆధారంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, క్యాట్ ఐస్, రోడ్డు బోర్డర్ లైన్స్ తదితర వాటిని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా బోర్డర్, టోల్ గేట్‌లలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, మద్యం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తి యాప్, నేర నియంత్రణ శాంతిభద్రతల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హత కలిగిన విద్యార్థులు ఏపీపీజీసెట్–2025 ద్వారా ఎంఏ ఎకనామిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీధర్ తెలిపారు. డిగ్రీలో బీఏ ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న వారితో పాటు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఏపీపీజీసెట్ దరఖాస్తుకు మే 5వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె మృతి





మృతి చెందిన ఈరన్న, శ్రావణి (ఫైల్)

ఆలూరు/ఆస్పరి: పేదింట్లో విషాదం నెలకొంది. పేదరికం నుంచి బయట పడేందుకు నలుగురు పిల్లలను చదివిస్తున్న ఆ కుటుంబంపై విధి పగపట్టింది. లారీ రూపంలో తండ్రి వడ్డె ఈరన్న(45)ను, అతని రెండో కుమార్తె వడ్డె శ్రావణి (14)ని కబళించింది. ఈ దుర్ఘటన పెద్దహోతూరు సమీపంలో నిర్మాణంలో నిలిచిన టోల్‌గేట్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన ఈరన్న, రాధమ్మ దంతులకు సెంటు భూమి లేదు. ఈరన్న టైలర్‌గా, రాధమ్మ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగించేవారు. వీరి పెద్ద కుమార్తె హిందు తొమ్మిదో తరగతి వరకు చదువుకుని తండ్రి దగ్గర టైలరింగ్ పని నేర్చుకుంటోంది. రెండో కుమార్తె శ్రావణి (14) చిప్పగిరిలో కస్తూర్బా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. మూడో కుమార్తె స్వాతి 6 తరగతి మండలంలోని బిల్లేకల్లు హైస్కూల్లో, చిన్న కుమారుడు విక్రమ్ 3వ తరగతి ముత్తుకూరులోనే చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యా శాఖ అధికారులు సెలవులు ప్రకటించడంతో రెండో కుమార్తె వడ్డె శ్రావణి ని తీసుకొచ్చేందుకు తండ్రి వడ్డె ఈరన్న మోటార్ సైకిల్‌పై చిప్పగిరి వెళ్లాడు. పాఠశాల నుంచి రెండో కుమార్తె శ్రావణితో పాటు సొంతూరుకు వస్తుండగా కర్నూలు నుంచి ఆలూరు వైపు వస్తున్న లారీ పెద్దహోతూరు సమీపంలో బలంగా ఢీ కొట్టింది. దీంతో తండ్రి, కుమార్తె ఇద్దంఒక్కసారిగా టైర్లు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఆలూరు ఎస్‌ఐ మహబూబ్ బాషా ,హెడ్ కానిస్టేబుల్ జానీవాకర్, పోలీసులు ప్రమాద స్థలాన్ని చేరుకుని మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల సబ్ జైల్‌కు మంగళవారం మూడో అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైల్ అధికారులతో మాట్లాడుతూ జైల్లో పరిసరాలు, గదులను పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఖైదీలు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కేసులు వాదించడానికి జైలుకు ప్రత్యేక ప్యానల్ న్యాయవాదిని ఏర్పాటు చేశామని, ఎటువంటి రుసుం లేకుండా న్యాయ సహాయం అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురుప్రసాద్ రెడ్డి, కోర్టు సిబ్బంది రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సబ్‌జైలులో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్న రాజు

జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కర్నూలు(సెంట్రల్): మూడు సంవత్సరాలుగా జిల్లాలో పనిచేస్తున్న పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా మే 2వ తేదీ లోపు ఆయా స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది.

- కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న టి.జ్యోత్స్న దేవిని ఖాళీగా ఉన్న పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో కర్నూలు ఎక్సైజ్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న ఎం.సరోజమ్మను నియమించారు.
- నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో పనిచేస్తున్న ఎస్.అనిల్ కుమార్‌ను కర్నూలు ఎక్సైజ్ కోర్టుకు బదిలీ చేశారు.
- కోవెలకుంట్లలో పనిచేస్తున్న అబ్దుల్ రహిమాన్‌ను నెల్లూరుకు బదిలీ చేశారు.
- ఖాళీగా ఉన్న బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జిగా అనంతపురంలో పనిచేస్తున్న ఎస్.ప్రతిమను నియమించారు.
- కర్నూలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.వందనను కృష్ణా జిల్లా నందిగామకు, మొబైల్ కోర్టులో పనిచేస్తున్న కళ్యాణిని బాపట్లకు బదిలీ చేశారు.
- డోన్‌లో పనిచేస్తున్న రాహుల్ అంబేద్కర్‌ను ఖాళీగా ఉన్న ఆత్మకూరు కోర్టుకు బదిలీ చేశారు.
- ఆళ్లగడ్డలో పనిచేస్తున్న ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్‌ను కడపకు బదిలీ చేసి ఆ స్థానంలో నెల్లూరులో పనిచేస్తున్న టి.భాస్కర్‌ను నియమించారు.
- కర్నూలు మొబైల్ కోర్టు జడ్జిగా సుళ్లూరుపేటలో పనిచేస్తున్న ఎస్.అనూషను నియమించారు.

మిర్చి రైతుకు మిగిలింది కన్నీరే!

- మార్కెట్‌లో లభించని గిట్టుబాటు ధర
- దిగుబడులు నష్టానికి అమ్ముకుంటున్న వైనం
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- క్వింటా మిర్చి రూ.8వేలు మాత్రమే!



కల్లంలో మిర్చిని ఆరబెట్టుకున్న రైతులు

సంజామల: ఆరుగాలం కష్టించి, లక్షల రూపాయల వ్యయం చేసి మిర్చి సాగు చేసిన రైతుకు నష్టమే మిగులుతోంది. మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంతో కన్నీరే మిగులుతోంది. బనగానపల్లె నియోజకవర్గంలో మొత్తం 9,198 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. సంజామలలో 4,200, కోవెలకుంట్లలో 2,605, బనగానపల్లెలో 1,733, అవుకులో 430, కొలిమిగుండ్ల మండలంలో 230 ఎకారాల్లో మిర్చి పంట వేశారు. ఆరు నెలలు నుంచి తెగుళ్లు, వైరస్ బారి నుంచి పైరును కాపాడుకున్నారు. అయితే పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. దళారులు అడిగిన ధరకే కొందరు రైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ధర వస్తుందన్న ఆశతో మరికొందరు కోల్డ్ స్టోరేజీల్లో మిర్చిని ఉంచుతున్నారు.

పాతాళానికి మిర్చి ధరలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మిర్చి సాగు రైతులకు కలిసొచ్చింది. క్వింటాకు గరిష్టంగా రూ.56 వేల వరకు ధర లభించింది. క్వింటా బ్యాడిగ రకం మిర్చికి 2022–23లో రికార్డు స్థాయిలో రూ.56 వేల వరకు ధర లభించింది. ఆ తర్వాత కూడా క్వింటా మిర్చిని రూ.20 వేలు నుంచి రూ.25 వేలు వరకు రైతులు విక్రయించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలో క్వింటా మిర్చి రూ.12 వేల వరకు ధర ఉండేది. ప్రస్తుతం క్వింటా రూ.8 వేలకే అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు.

ఇదీ దుస్థితి..

గత వైస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు సంతోషంగా ఉండేవారు. మిర్చి వేసిన రైతుకు గిట్టుబాటు ధరతో పాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేది. ప్రతి సంవత్సరం రైతు భరోసా పథకం కింద రూ.1,3500 అన్నదాతల బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేది. ప్రకృతి వైపరీత్యంతో రైతు నష్టపోతే పంట నష్టం పథకం పరిహారం అందించేది. గత ప్రభుత్వంలో కేజీ మిర్చి ధర రూ.250తో కూడా రైతు అమ్ముకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అందలేదు. ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సహాయం ఇస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. వాతావరణం అనుకులించక రైతు నష్టపోతుంటే పంట నష్టం పథకాన్ని అమలు చేయడం లేదు. ప్రస్తుతం కేజీ మిర్చిని రూ.85కే అమ్ముతున్నారు. ఎకరాకు దాదాపు రూ.2లక్షలు పెట్టుబడి అవుతుంటే గిట్టుబాటు ధరలేక రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

ఇవీ కష్టాలు..

- మిర్చి సాగు చేసిన రైతులు రెండు కోతలు పూర్తి చేసుకుని చివరి కోతకు సిద్ధం అయ్యారు.
- ఎకరాకు చివరి కోతకు దాదాపు 20 నుంచి 30 కూలీలు అవసరం.
- కూలీలు అందుబాటులో లేక ఇతర గ్రామాల నుంచి తీసుకు రావాల్సి వస్తోంది.
- కూలీల రవాణా ఖర్చు, ట్రాక్టర్ బాడుగ భారంగా మారింది.
- మొదట రెండు కోతల్లో అంతంత మాత్రమే దిగుబడులు వచ్చాయి.

వైరస్ సోకింది



లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టాం. వాతావరణం అనుకూలించక దిగుబడి అరకొర వచ్చింది. ఈ సంవత్సరం వైరస్ సోకి పంట చాలా దెబ్బతినింది. మిర్చి రైతులు నష్టాల్లోనించి బయటపడాలంటే గిట్టుబాటు ధర ఇవ్వాలి. – లావనూరు ధర్మారెడ్డి

దయనీయం



ఈ ఏడాది 3 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. మొదటి కోతకు వచ్చిన మిర్చి కేజీ రూ.113 ధర అమ్మాను. ప్రస్తుతం రూ.85కే అడుగుతున్నారు. రైతు పరిస్థితి దయనీయంగా మారింది. –హాజీపీరన్

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను 15 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరాకు దాదాపు రూ.2 లక్షలు పెట్టుబడి అయ్యింది. మార్కెట్‌లో ధర లేదు. రైతు నష్టపోతున్నాడు. కూటమి ప్రభుత్వంలో రైతుకు ఎటువంటి సాయం అందలేదు. గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. కనీసం మిర్చి రైతును అయినా ఆదుకోవాలి. –గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి

సివిల్స్‌లో పవన్ విజయం

- సత్తా చాటిన కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థి
- మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లొచ్చారు
- రెండో ప్రయత్నంలో 375వ ర్యాంకు



కుటుంబ సభ్యులతో ఎం. పవన్ కుమార్ రెడ్డి



కర్నూలు సిటీ: సివిల్స్ ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థి పవన్ కుమార్ రెడ్డి 375వ ర్యాంకు సాధించారు. కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన(ప్రస్తుతం కర్నూలులోని ఎస్.ఆర్‌పేట్‌లో ఉంటున్నారు) ఎం.కృష్ణారెడ్డి, ఎం.మధుమతి దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు ఎం.పవన్‌కుమార్ రెడ్డి కర్నూలు మెడకల్ కాలేజీలో వైద్య విద్యను అభ్యసించే సమయంలోనే కుటుంబ సభ్యుల సలహా, సూచనల మేరకు సివిల్స్‌కు సన్నద్ధం అయ్యారు. మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు వెళ్లొచ్చారు. రెండోసారి 2024 నోటిఫికేషన్‌లో మెడికల్ సైన్స్ ఆప్షనల్ సబ్జెక్టు ఎంపిక చేసుకోని 375వ ర్యాంకు సాధించారు. తండ్రి ఎం.కృష్ణారెడ్డి కర్నూలు రూరల్ మండలం పంచలింగాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగాను, తల్లి ఎం.మధుమతి.. ఆర్.కొంతలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు కావడంతో కుమారుడు పవన్ కుమార్ రెడ్డి.. కర్నూలు నగరంలోని ప్రైవేటు స్కూళ్లలోనే హైస్కూల్ విద్య పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ విద్య గుంటూరులోని ఓ కార్పొరేట్ కాలేజీలో చదివి, ఏపీ ఎంసెట్(అప్పటికి నీట్ ఉండేది కాదు)లో రాష్ట్ర స్థాయిలో 600వ ర్యాంకు రావడంతో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్య చదివారు. మెడిసిన్ 2022లో పూర్తి అయ్యాక సివిల్స్ ప్రిపేర్ కావాలని తల్లిదండ్రులు చెప్పడంతో 2023లో మొదటిసారి మొదటిసారి ప్రయత్నం చేసి ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. మరోసారి 2024 ఫిబ్రవరిలో ఇచ్చిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేసి, గతేడాది జూన్ 16న ప్రిలిమ్స్ పరీక్ష రాసి అర్హత సాధించారు. సెప్టెంబరు 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన మెయిన్స్ పరీక్షలు రాసి ఈ ఏడాది జనవరి 17న ఇంటర్వ్యూకు హాజరయ్యారు. తన విజయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారని పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజు 8నుంచి 10 గంటల పాటు, పరీక్షల సమయంలో 12 గంటల పాటు చదివేవాడినని వెల్లడించారు. సివిల్స్ సన్నద్ధం కావాలనుకునేవారు ఇష్టమైన సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవాలని సూచించారు. రోజుకు కనీసం 10 గంటలు చదివితేనే సివిల్స్‌లో ర్యాంకు సాధించవచ్చునని తెలిపారు. తమ కుమారుడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఆర్‌యూ బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్/సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 3,537 మంది రెగ్యులర్, 545 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

గోనెగండ్ల: ఐదు రోజుల క్రితం భర్తను చంపిన నిందితురాలు చిట్టెమ్మను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్లలోని చాకలి వీధికు చెందిన బలిజ సురేష్‌కు భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుతూళ్లు, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా సురేష్ మద్యానికి బానిసై చిటెమ్మను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 17వ తేదీన రాత్రి సురేష్, చిట్టెమ్మ గొడవ పడ్డాడు. ఆ తర్వాత సురేష్ ఒంటికి నిప్పు అంటుకొని కేకలు వేస్తూ చనిపోయాడు. అయితే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య తెలిపింది. కాగా మృతుని తల్లి నాగమ్మ తన కుమారుడు సురేష్ మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో చిట్టెమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా, వేధింపులు తాళలేక తానే పెట్రోల్‌పోసి నిప్పంటించానని చెప్పిందని సీఐ తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిందితురాలు చిట్టెమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

తల్లి మందలించిందని..

కర్నూలు: నిత్యం ల్యాప్‌టాప్ చూస్తే కళ్లు దెబ్బతిని ఆరోగ్యం పాడవుతుందని మందలించినందుకు తనయుడు మంగలి ప్రశాంత్ (17) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు పాతబస్తీలోని చిదంబర రావు వీధిలో నివాసముంటున్న మంగలి తిరుమలేష్, రాణి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు నిరంజన్ ఎంసెట్‌కు సిద్ధమవుతుండగా చిన్న కుమారుడు ప్రశాంత్ గత సంవత్సరం టెన్త్ క్లాస్ ఫెయిల్ అయి ఈ సంవత్సరం మళ్లీ పరీక్షలు రాశాడు. వాటి ఫలితాలు రాలేదు. ప్రతి రోజూ ల్యాప్‌టాప్ చూస్తూ కాలక్షేపం చేస్తుండగా అలా చూస్తే కళ్లు దెబ్బతింటాయని తల్లి మందలించింది. అయినా పట్టించుకునేవాడు కాదు. మంగళవారం మధ్యాహ్నం తల్లి రాణి ఇంట్లో బట్టలు కుడుతుండగా ప్రశాంత్ ల్యాప్‌టాప్ చూస్తున్నాడు. దానిని పక్కన పెట్టి భోజనం చేద్దాం రా అని తల్లి పిలిచినప్పటికీ వినకపోవడంతో ల్యాప్‌టాప్‌ను లాగేసుకుంది. దీంతో ప్రశాంత్ కలత చెంది మిద్దెపై ఉన్న రేకుల షెడ్డులో చీరతో ఉరేసుకున్నాడు. ఎంత సేపటికీ కొడుకు మిద్దె పైనుంచి రాకపోవడంతో తల్లి పైకి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఇరుగుపొరుగు సాయంతో ఆటోలో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యానికి 'సెలవు'

- వంద పడకల ఆసుపత్రిలో వైద్యుల కొరత
- 23 మంది వైద్యుల్లో ప్రస్తుతం ఆరుగురే
- 11 మంది సెలవులో, మరో ఆరుగురు బదిలీ
- నాడు ఓపీ 600.. నేడు 200
- సేవలు అందక ప్రజల అవస్థలు





స్కానింగ్ సెంటర్ వద్ద నేలపై వేచివున్న గర్భిణులు (ఇన్‌సెట్) బెంచీలు లేక నిలిచివున్న దివ్యాంగుడు

డోన్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు నానాటికీ సన్నగిల్లుతున్నాయి. పట్టణ శివారులో దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.40 కోట్లతో కార్పొరేట్ తరహాలో ఆధునిక యంత్ర పరికరాలతో వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వంద పడకల ఆసుపత్రిలో వైద్యం దైవాదీనంగా మారుతోంది. ఆసుపత్రి ప్రారంభం 23 మంది వైద్యులను గత ప్రభుత్వం నియమించగా.. ఇందులో సగానికి సగం మంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడి నుండి బదిలీ, సెలవులపై వెళ్లి పోయారు. గతంలో ప్రతిరోజూ 600 వరకు ఓపీ నడవగా ప్రస్తుతం 200కు పడిపోయింది. ఇందుకు కారణం ప్రస్తుతం వైద్యుల్లో ఆరు బదిలీలపై వెళ్లిపోవడం, 11 మందిలో కొందరు మహిళా వైద్యులు ప్రసూతీ సెలవు, కొంత మంది మెడికల్ లీవ్‌లపై వెళ్లిపోయారు. రేడియాలజిస్ట్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో డాక్టర్ల సంఖ్య ప్రస్తుతం ఆరుకు పరిమితమైంది. ఇందులో ఆర్థో డాక్టర్‌ను జిల్లా వ్యాప్తంగా జరిగే సదరన్ క్యాంపులకు డ్యూటీపై వేయడంతో ఆయన కూడా అందుబాటులో లేరు. ఇందుకు సంబంధించిన రోగులందరూ ప్రతిరోజూ ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ఆసుపత్రికి రావడం, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోవడం నిత్యకృత్యమైంది. నిన్నటి వరకు శస్త్రచికిత్సలు, ఆధునాతన వైద్య సేవలు అందించిన ఆసుపత్రిలో సేవలు మృగ్యమవుతుండటంతో పేదలు ఆందోళన చెందుతున్నారు.



ఆసుపత్రి ఆవరణలో నేలపై కూర్చున్న దివ్యాంగురాలు



మూతపడిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్

గర్భిణుల కష్టాలు

ప్రభుత్వాసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ వైద్యులు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిపోవడంతో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు ఇక్కడి వైద్యులు సిఫారసు చేస్తున్నారు. ఒక్కొక్క స్కానింగ్‌కు రూ.1500 నుండి రూ.2వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. సాధారణ స్కానింగ్ కోసం కూడా గంటల తరబడి నేలపై కూర్చొని వేచిచూడాల్సిన దుస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా కనీసం ఆసుపత్రిలో ఫర్నీచర్ కూడా ఏర్పాటు చేయలేదు.

డాక్టర్లు లేరని చెబుతున్నారు



మా ఊరి నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న డోన్ ఆసుపత్రికి వస్తే అవసరమైన వైద్యులు అందుబాటులో లేరని చెబుతున్నారు. ఇంత పెద్దాసుపత్రిలో కూర్చునేందుకు కనీసం బెంచీలు కూడా లేవు. సేదతీరేందుకు చెట్లు, షెడ్ల లాంటి సౌకర్యాలు కల్పించలేదు. గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– లక్ష్మీదేవి, ఎస్.రాచెర్ల గ్రామం, ప్యాపిలి మండలం

వైద్యులను నియమించాలి



ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి వచ్చే రోగులకు వైద్యసేవలు సంతృప్తి కలిగించడం లేదు. ఈఎన్‌టీ, స్కిన్, ఆర్థోపెడిక్ వైద్యులు లేకపోవడంతో చాలా మంది రోగులు వెనుదిరిగి వెళ్లాల్సి వస్తోంది. పేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్, బావిపల్లె గ్రామం, ప్యాపిలి మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం..



ఆసుపత్రిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తూనే ఉన్నాం. త్వరలోనే ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో కొన్నిపోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. సెలవుల విషయంలో తాము వైద్యులను చేయగలిగిందేమీ లేదు. వారి స్థానంలో డిప్యుటేషన్‌పై కనీసం సగం మందినైనా నియమిస్తే మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

– డాక్టర్ హనీఫ్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డోన్

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని జొహరాపురం రోడ్డులో ఉన్న లక్ష్మీ గార్డెన్‌లో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన గోపాల్ కూతురు వేదావతి (27) ఎంఏ వరకు చదువుకుని ఇంటి దగ్గరే ఉంటోంది. కాగా పెళ్లి చేసేందుకు తండ్రి సంబంధాలు చూస్తుండగా ఉద్యోగం వచ్చిన తర్వాత చేసుకుంటానంటూ వాయిదా వేస్తూ వచ్చింది. ఈనెల 15వ తేదీన పెళ్లి విషయంలో కూతురిని తండ్రి గట్టిగా మందలించడంతో మనస్తాపానికి గురై అదే రోజు జొహరాపురం రోడ్డులో ఉన్న లక్ష్మీ గార్డెన్‌లో ఉంటున్న మేనత్త చంద్రకళ ఇంటికి వచ్చింది. వారు కూడా పెళ్లి విషయం ప్రస్తావించడంతో మనస్తాపానికి గురైన వేదావతి అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. 16వ తేదీన గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్యచికిత్సలు చేయించారు. కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాలకృష్ణ ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జింక దాడిలో వ్యక్తికి గాయాలు

వెల్దుర్తి: చెరుకుల పాడు గ్రామ సమీపంలో పెద్దమ్మ గుడి వద్ద జింకల గుంపు రహదారిని దాటే క్రమంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వెల్దుర్తి పట్టణానికి చెందిన ముత్యాల దానం కృష్ణగిరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ (వాచ్‌మెన్)గా పని చేస్తున్నాడు. ప్రతిరోజులాగే విధులు పూర్తి చేసుకుని సోమవారం రాత్రి బైక్‌పై వెల్దుర్తికి బయలుదేరాడు. మార్గమధ్యలో పెద్దమ్మ గుడి వద్ద జింకల గుంపు రహదారి దాటే ప్రయత్నం చేసింది. గమనించిన దానం తన వాహనాన్ని నిలిపాడు. ఈ సమయంలో పక్కనుంచి వేగంగా ఎగురుకుంటూ వచ్చిన జింక అతనిపై పైనుంచి దూకి వెళ్లింది. ఆ క్రమంలో అతని తలకు జింక కాలి గిట్ట తగలడంతో తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బంగారుపేట సారా స్థావరంపై పోలీసుల దాడి

- 65 లీటర్ల నాటు సారా సీజ్



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కర్నూలు: కర్నూలులోని బంగారుపేట కేసీ కెనాల్ గట్టు పొడవున ఉన్న నాటుసారా స్థావరంపై సివిల్, ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయమే రెండో పట్టణ పోలీసులు, కర్నూలు ఎక్సైజ్ పోలీసులు పెద్ద ఎత్తున బంగారుపేటకు చేరుకోవడంతో ప్రజలు ఏమి జరిగిందోనని ఆందోళనకు లోనయ్యారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రాజశేఖర్ గౌడ్, రామ కృష్ణారెడ్డి, సీఐలు నాగరాజరావు, మన్సూరుద్దీన్, నాగశేఖర్, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, జయరాం నాయుడు, కృష్ణ తదితరులు ఐదు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డు నుంచి ఆనంద్ థియేటర్ వరకు దాదాపు కిలోమీటర్ పొడవున నాటు సారా స్థావరాలపై దాడులు జరిపి బట్టీలను ధ్వంసం చేశారు. 1,350 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసి 65 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నీలి షికారి భాగ్యమ్మపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలన ఆవశ్యకతను, సారా వినియోగం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలను వార్డు ప్రజలకు వివరించారు.

కూలిన బతుకులు

- మట్టి పెళ్లలు మీద పడి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు దుర్మరణం



మృతి చెందిన కాకి సోమన్న, బోయ మధు

కోడుమూరు రూరల్: కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులను మట్టి పెళ్లలు మింగేశాయి. ఇంటి పునాదుల కోసం తీసిన గుంతలు వారికి సమాధి అయ్యాయి. ఇంటి నిర్మాణానికి పిల్లర్లు వేస్తుండగా అకస్మాతుగా పైనుంచి మట్టి పెళ్లలు మీద పడి ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందిన సంఘటన మంగళవారం గూడూరులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరుకు చెందిన చికెన్ వలి అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం సుమారు 9 అడుగుల మేర గుంతలు తవ్వించగా, భవన నిర్మాణ కార్మికులు గత కొద్ది రోజుల నుంచి పిల్లర్లు వేస్తున్నారు. మంగళవారం కూడా ఎప్పటిలాగే పిల్లర్లు వేసేందుకు గూడూరుకు చెందిన బోయ మధు (25), కాకి సోమన్న (35) మరి కొందరు పనికెళ్లారు. గుంతల్లో దిగి పనులు చేస్తుండగా, ఒక్కసారిగా పై నుంచి మట్టి పెళ్లలు విరిగి వారిపై పడ్డాయి. దీంతో ప్రమాదాన్ని గమనించిన చుట్టు పక్కల వాళ్లు, తోటి కార్మికులు జేసీబీ సాయంతో వారిపై పడ్డ మట్టిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాకి సోమన్నకు భార్య సువర్ణతో పాటు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బోయ మధుకు ఏడాది క్రితం వివాహం జరిగింది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు చెందిన పెద్ద దిక్కులైన వ్యక్తులు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గూడూరులో ఒకే రోజు ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంతో విషాదం అలుముకుంది. మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మోహన్ ప్రభుత్వాన్ని కోరారు.



భవన నిర్మాణ కార్మికులపై పడ్డ మట్టిని తొలగిస్తున్న జేసీబీ

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) వారి కార్యాలయము, కడప.
ఇ. ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

టి.నో.నం.01/రివైజ్డ్ ఇఇ (ఎం)/కెడిపి/2025-26 తేది: 22.04.2025

కార్యనిర్వాహక ఇంజనీరు (వ్యవసాయ మార్కెటింగ్) కడప డివిజన్ నందు **చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల,మరియు అనంతపురం జిల్లాలలోని** సాయిల్ టెస్టింగ్ లాబ్‌ల నందు మరమత్తుల పనులకు అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైను ద్వారా టెండర్లు కోరుచున్నారు. మిగతా వివరములకు **https://tender.apeprocurement.gov.in/** మీద సంప్రదించగలరు మరియు కార్యాలయ వేళలో ఫోన్ నెం.9182361172 ని సంప్రదించగలరు.

(కె. సుబ్బారెడ్డి) కార్యనిర్వాహక ఇంజనీరు, పూ.అ.భా (వ్యవసాయ మార్కెటింగ్), కడప.

NANDYAL MUNICIPALITY
e-Procurement
Tender Notice No:03/2025-26/E1, Dt:22-04-2025

మునిసిపల్ సాధారణ నిధులతో రూ. 650.62 లక్షలతో 47 పనులు అర్హులైన కంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును. వివరములకు e-procurement.gov.in నుండి పొందగలరు.

సం/- కమీషనరు, నంద్యాల పురపాలక సంఘము

విధుల్లో అలసత్వం తగదు



వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసులు

ఆలూరు: విధి నిర్వహణలో వైద్య సిబ్బంది అలసత్వం వహించడం తగదని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ కేంద్రాన్ని (ప్రజా ఆరోగ్య కమ్యూనిటీ అర్బన్ హెల్త్ కేంద్రాన్ని) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువ శాతం పేదలు ఉంటారని, వారిని నిర్లక్ష్యం చేయడం మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కోట్లాది రూపాయలతో ఆధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని, వాటిని సద్వినియోగం చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో సివిల్‌సర్జన్ డాక్టర్ వాహిద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్, రామకృష్ణ, స్టాఫ్ నర్సులు నిర్మల, మంగమ్మ, రాజేశ్వరి, భారతి, ఎన్టీఆర్ ఆరోగ్య మిత్రలు కృష్ణారెడ్డి, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సులో పొగలు

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్ల శివారులో ఆర్టీసీ బస్సు బానెట్ నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. కర్నూలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం మధ్యాహ్నం ఎమ్మిగనూరు నుంచి ప్రయాణికులతో కర్నూలుకు బయలు దేరింది. అయితే గోనెగండ్ల శివారులో డ్రైవర్ పక్కనే ఉన్న ఇంజిన్ బానెట్ నుంచి పెద్దగా పొగలు వచ్చాయి. వెంటనే డ్రైవర్ గుర్తించి బస్సు నిలిపివేశాడు. ప్రయాణికులు భయంతో కేకలు వేస్తూ బస్సు దిగి పరుగులు పెట్టారు. కొంత సేపటికీ బస్సులో పొగలు నిలిచిపోయాయి. బస్సు కండెక్టర్ ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు.

క్రీడలతో పాటు వ్యాయామం తప్పనిసరి

- రేంజ్ పోలీసుల క్రీడా పోటీల్లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ

కర్నూలు: పోలీసు సిబ్బందికి క్రీడలు, వ్యాయామం చాలా అవసరమని, వీటి ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల (రేంజ్ పరిధిలో) పోలీసులకు కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం క్రీడల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కర్నూలు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో క్రీడాపోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న పోలీసు సిబ్బందికి అవకాశం కల్పించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, షటిల్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, క్రికెట్, బాస్కెట్ బాల్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోలీసు క్రీడాపోటీలు త్వరలో జరగనున్న నేపథ్యంలో రేంజ్ పరిధిలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన పోలీసులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, ఆర్ఐలు, రేంజ్ పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పోటీల్లో పాల్గొన్నారు.

చదవాలంటే ఎండకు నడవాల్సిందే!



పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు బస్సు సౌకర్యం లేక కాలినడకన పాఠశాలకు వచ్చి వెళ్తున్నారు. మండుతున్న ఎండలకు పెద్దలే తల్లడిల్లిపోతున్నారు. విద్యార్థులు మాత్రం మండుటెండలోనే పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. రాచర్ల ఉన్నత పాఠశాలకు కొమ్మేమర్రి, నేరేడుచెర్ల, బొంచెర్వుపల్లి తదితర గ్రామాల విద్యార్థులు ప్రతి రోజూ కాలినడకన వచ్చి వెళ్తున్నారు. ఒంటి పూట బడులు కావడంతో మధ్యాహ్నం 12–30 గంటలకు విద్యార్థులను ఇంటికి వదులుతున్నారు. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు మంగళవారం సూర్యుడు నడినెత్తిన ఉన్న సమయంలో నడకయాతన పడుతూ ఇళ్లకు వెళ్తూ కనిపించారు.

– ప్యాపిలి

ఉన్నత చదువులతో రాణించాలి

- రాష్ట్ర స్థాయిలో కర్నూలు సంక్షేమ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 83.91 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే అత్యుత్తమ ప్రతిభను చాటారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదివి ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని కోరారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు సహకారం అందించిన వసతి గృహ సంక్షేమాధికారులను కూడా ఆయన అభినందించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ మెడల్స్, నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి, సహాయ సాంఘిక సంక్షేమాధికారులు కె.బాబు, బి.మద్దిలేటి, వసతి గృహ సంక్షేమాధికారిణులు బి.బెన్నమ్మ, రజినమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు: కె.రాఘవేంద్ర(958),కె.రోజ(955), ఎస్.సలీమా (953), ఎం.సాయిప్రసాద్(935), కె.తరుణ్(933), బి.దస్తగిరమ్మ(926), ఎం.ప్రభావతమ్మ(919).

కర్నూలు మార్కెట్‌లో వరి ధాన్యం అమ్ముకోండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం (వడ్లు) క్రయ, విక్రయాలకు అవకాశం కల్పించామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. దాదాపు నెల రోజుల క్రితమే మార్కెట్‌లో ధాన్యం క్రయవిక్రయాలను ప్రారంభించినా రైతుల నుంచి స్పందన లేదన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకవచ్చి గిట్టుబాటు ధరతో అమ్ముకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ పొలాలు, ప్లాట్లు అమ్ముటకు, కొనుటకు సంప్రదించండి: సెల్: 96184 45969 పెద్ద బోధనం, నందికొట్కూరు, హెచ్.కైరవాడి, ఉలిందకొండ దగ్గర పొలాలు ఉన్నాయి. [L-779094]

PLOT FOR SALE

■ నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో వాసవి నగర్ నందు 100 అ॥ల రోడ్డుకు 11 సెంట్ల ప్లాటు లీజు/అద్దెకు ఇవ్వబడును. ✆ 83413 80122, 95027 66466. [L-779127]

SERVICES

HEALTH CARE

■ విశ్వభారతి హాస్పిటల్, కర్నూలు వారి ప్రముఖ వైద్యులు డా॥ పీటర్ ప్రవీణ్ (కార్డియాలజీ & పలమనాలజీ) & డా॥ హితేష్ రెడ్డి (కార్డియాలజీ) గారి ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఉ॥ 10.00 గం॥ల - మ॥ 2.00 గం॥ల వరకు గుండె మరియు ఊపిరితిత్తుల సమస్యల కొరకు అందుబాటులో గలరు. సంప్ర: 90329 99565. అడ్రస్: గురవయ్యశెట్టి గారి హాస్పిటల్, Opp: ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్, నందికొట్కూరు. [L-779124]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [HA-453]

WANTED

■ కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 39 స్త్రీ/పు॥లు కావలెను. జీ:14వేలు+DA6వేలు+ బోనస్+ ఫ్రీ రూం, అ: 7th-డిగ్రీ, ITI డిప్లొమా (P/F), శ్రీనివాస టాకీస్, కల్లూరు రోడ్, కర్నూలు. 80748 16824 [L-794807]

■ శ్రీ శక్తి మైక్రో ఫైనాన్స్ నందు పనిచేయుటకు ఫీల్డ్ స్టాఫ్ కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ. సంప్ర: ఐకాన్ షాపీ కాంప్లెక్స్, బిర్లా కాంపౌండ్ (యూనియన్ బ్యాంక్ కాంప్లెక్స్), 4th ఫ్లోర్, కర్నూలు. ✆ 83413 80122, 95027 66466. [L-779128]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆఫీస్ అడ్రస్: ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ శివాలయం టెంపుల్ ప్రక్కన. అర్హత: 10th పాస్. జీతం:16,000, రూమ్ ఫ్రీ, భోజన వసతి కలదు. Age: 19 to 45 సం॥. సంప్ర: ✆ 8897444705, 8106184820. [SCA25002873]

■ Wanted BM & SM's to STAR HEALTH INSURANCE for Nandyal & Kurnool branches. Age Below:45. Preferred Insurance Experience. ✆ 94901 30695. [L-536]

■ ప్రముఖ కంపెనీ తరుపున కర్నూలు జిల్లాలో స్కూల్ to స్కూల్ తిరిగి మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ కావలెను. Ph : 7702805174 [SCA-25002829]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నంద్యాల జిల్లా మరియు ప్రకాశం జిల్లాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 10th, Interపాస్ అయినవారికి జీ: 20,000/- ✆ 9963704460, 8978827181, 9052124024 [G-820034]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA25002806]

■ కష్టజీవ్వి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 9014885406 [HA-379]

■ No Bike Kurnool సిటీలో ప్రముఖ పిజ్జా సంస్థలో పనిచేయడానికి డెలివరీ బాయ్స్ కావలెను. స్మార్ట్ ఫోన్ పాన్ ఆధార్ & DL మస్ట్, వీక్లీ పేమెంట్స్. Ph: 8688909118, 8686242288 [HA-69]

■ **Immediate joining** for Ayyappa Agencies banking Collections Dept. (HDFC & AXIS Agri Tractor Bank) Required Team Leaders - 1+years Experience. Collection Executives both Fresher & Experience. Location: Kurnool, Cell: 8885609229, 9966778879 [T-SCA25002918]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

